రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

- ఆర్టీవో కార్యాలయంలో రక్తదానం, కంటి వైద్య శిబిరం
- ముగిసిన రోడ్డు భద్రత వారోత్సవాలు
- జిల్లా రవాణాశాఖాధికారి సీతారామిరెడ్డి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా రవాణాశాఖాధికారి సీతారామిరెడ్డి

తిరుపతి మంగళం : రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా రవాణాశాఖాధికారి సీతారామిరెడ్డి పిలుపు నిచ్చారు. రవాణాశాఖ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహించిన రోడ్డు భద్రతావారోత్సవాలు మంగళవారం ముగిశాయి. వారోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం మంగళంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో రుయా ఆస్పత్రి ఆధ్వర్యంలో రక్తదానం, అరవింద కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. రవాణాశాఖ సిబ్బందితో పాటు వాహన డ్రైవర్లు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అలాగే ప్రైవేటు స్కూల్స్, కళాశాలల వాహన డ్రైవర్లకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, కంటి అద్దాలు, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా రవాణాశాఖాధికారి సీతారామిరెడ్డి మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు తమను నమ్ముకుని బస్సుల్లో ఎక్కిన విద్యార్థులు, ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యానికి చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్లదే అన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. అనేక మంది చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగా నూరేళ్ల జీవితాన్ని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాలు నడిపేటప్పుడు రవాణా, పోలీసుశాఖల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. దాంతో పాటు మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని హెచ్చరించారు. డ్రైవర్లు ప్రతి ఒక్కరు మూడు నెలలకు ఒక్కసారి కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రక్తదానం చేయడం వల్ల మరొకరికి పునర్జన్మను ప్రసాదించిన వారమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు చంద్రశేఖర్‌నాయుడు, శ్రీనివాసరావ్, కుసుమ, శ్వేతబిందు, ఎస్వీ అరవింద కంటి ఆసుపత్రి డాక్టర్ లక్ష్మీ శిరీష, రుయా బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యు. లత, డాక్టర్ బి. వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు కృషి



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ప్రకాష్‌కుమార్

భాకరాపేట: ప్రమాదాల నివారణ మనందరి బాధ్యత అని భాకరాపేట ఎస్ఐ ప్రకాష్ కుమార్ అన్నారు. భాకరాపేటలో మంగళవారం ఆటోడ్రైవర్లకు రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా ప్రమాదాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నియమాలు పాటించడం, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదన్నారు. అలాగే ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు షురూ



గణతంత్ర వేడుకలకు ముస్తాబవుతున్న టీటీడీ పరిపాలన భవన మైదానం

తిరుపతి అలిపిరి: తిరుపతి టీటీడీ పరిపాలన భవనంలో జనవరి 26వ తేదీ గురువారం నిర్వహించనున్న గణతంత్ర వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పరిపాలన భవనం వెనుక వైపున ఉన్న పరేడ్ మైదానంలో టీటీడీ కార్యనిర్వహణాధికారి ఏవీ ధర్మారెడ్డి ఉదయం 8.30 గంటలకు జాతీయ జెండాను ఎగురవేస్తారు. అనంతరం ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. విధినిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు. ఈ సందర్భంగా టీటీడీ భద్రతా విభాగంలోని బెటాలియన్ల పరేడ్, విద్యా సంస్థల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తారు. కార్యక్రమంలో టీటీడీ ఉన్నతాధికారులు, విభాగాధిపతులు, ఉద్యోగులు పాల్గొంటారు.

57మందికి జరిమానా

తిరుపతి లీగల్ : తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడపడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటి నేరాలకు పాల్పడిన 57మందికి రూ.50,800 జరిమాన విధిస్తూ తిరుపతి మొదటి ప్రత్యేక కోర్టు మేజిస్ట్రేట్ సుబ్బలక్ష్మి మంగళవారం తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్, ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు నేరాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.

దాడి కేసులో నిందితుడికి రిమాండు..

ఓ మహిళపై దాడి చేసి గాయపరచిన కేసులో తిరుపతి జీవకోన క్రాంతినగర్‌కు చెందిన జి.రెడ్డెప్పకు ఫిబ్రవరి 7వ తేదీ వరకు రిమాండు విధిస్తూ తిరుపతి 5వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరిత మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది డిసెంబరు 7వ తేదీ ఓ మహిళతో నిందితుడు రెడ్డెప్ప గొడవ పడి చెక్కతో దాడి చేసి గాయపరిచాడు. ఆమె సోదరుడు రమేష్‌బాబు ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.

వైభవంగా మహాకుంభాభిషేకం



కుంభాభిషేక పూజల్లో పాల్గొన్న భక్తులు

రామచంద్రాపురం: మండలంలోని కొత్తనెన్నూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో మంగళవారం మహాకుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, వాస్తుహోమం, గ్రామోత్సవం, కలశస్థాపన భక్తిశ్రద్ధలతో చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నూతన కమిటీ ఎంపిక



జిల్లా కన్వీనర్ ఎం.మోహన్‌బాబు



జిల్లా కో కన్వీనర్ రాయల్ ఆక్వా రఘు




నగర అధ్యక్షుడు ఎ.బాలాజీ



ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: తిరుపతి వాటర్ ప్లాంట్ అసోసియేషన్ నూతన కమిటీని ఎంపిక చేసినట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడుగా తనను, గౌరవ సలహాదారునిగా రాజు, జిల్లా కన్వీనర్‌గా ఎం.మోహన్‌బాబు, కోకన్వీనర్‌గా రాయల్ ఆక్వా రఘు, నగర అధ్యక్షుడు ఎ.బాలాజీ, ప్రధాన కార్యదర్శిగా భాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా రవి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా శోభన్‌బాబు, ఉపాధ్యక్షులుగా కిషోర్, ఉదయ్, ముద్దుకృష్ణ, సహాయ కార్యదర్శులుగా టి.రమణ, రఘు, హెచ్. శారదతో పాటు 11 మంది కార్యవర్గ సభ్యులు, 10 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ కులశేఖర్

రేణిగుంట : స్థానిక చెక్‌పోస్టు సమీపంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మంగళవారం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా తిరుపతి అడిషినల్ ఎస్పీ కులశేఖర్ పలువురు డ్రైవర్లకు నిబంధనలపై అవగాహన కల్పించారు. జాగ్రత్తలు పాటిస్తూ వాహనాలను నడపటం ద్వారా రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చన్నారు. అనంతరం వాహన డ్రైవర్లతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రేణిగుంట డీఎస్పీ రామచంద్ర, సీఐలు సుబ్బారెడ్డి, శ్రీహరి, ఎస్ఐ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

బాలికలే భవిష్యత్తుకు వెలుగు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీహరి



విద్యార్థినులకు సూచనలు చేస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

- నేడు అన్ని రంగాల్లో అగ్రస్థానం
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీహరి

తిరుపతి తుడా: బాలికలే భవిష్యత్తుకు వెలుగని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీహరి తెలిపారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బీటీఆర్ కాలనీ జిల్లా ఉన్నత పాఠశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీహరి ప్రసంగిస్తూ సమాజంలో బాలికలు అన్ని రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని భవిష్యత్తుకు వారే వెలుగని తెలిపారు. ప్రోత్సహిస్తే బాలికలు అన్ని రంగాల్లో ముందుంటారని చెప్పారు. ప్రస్తుతం దేశంలో చాలామంది మహిళలు ఉద్యోగాల్లోనే కాక అన్ని రంగాల్లో అగ్రస్థానాల్లో ఉన్నారని గుర్తుచేశారు. సమాజంలో కొంతమంది లింగ వివక్షకు పాల్పడి లింగ నిర్ధారణ చర్యలకు పాల్పడడం వల్ల బాలికల సంఖ్య తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. లింగ నిర్ధారణ చర్యలకు పాల్పడిన వారికి రూ.10వేలు జరిమానాతో పాటు 3 సంవత్సరాలు జైలు శిక్షలుంటాయని హెచ్చరించారు. 10–19 సంవత్సరాల వయస్సులో బాలికలు క్రమం తప్పకుండా హిమోగ్లోబిన్ పరీక్షలు చేయించుకోవాలని ఒకవేళ పరీక్షలో రక్తహీనత ఉన్నట్లైతే పాలు, గుడ్లు, చిక్కీలు వంటి బలమైన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మంగళం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ స్రవంతి, హెచ్‌ఎం కేశవులు నాయుడు, పీహెచ్‌సీ సిబ్బంది తాష్కంట్, రామలక్ష్మమ్మ, పద్మజ, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

లింగ సమానత్వం అందరి బాధ్యత

తిరుచానూరు: లింగ సమానత్వం పాటించడం అందరి బాధ్యత అని ఎస్వీయూ వీసీ కె.రాజారెడ్డి పిలుపునిచ్చారు. ఎస్వీ యూనివర్శిటీలో మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య డి.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందడుగు వేస్తున్నారని తెలిపారు. లింగ సమానత్వ కార్యక్రమాల ద్వారా లింగ చైతన్యం కలిగిన సమాజం ఏర్పడుతుందని తెలిపారు. మరో అతిథి ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్ ఆచార్య బీవీ.మురళీధర్ మాట్లాడుతూ ప్రపంచ జనాభాలో మొదటి స్థానానికి చేరుకుంటున్న భారతదేశం లింగ నిష్పత్తిలో వెనుకబడి ఉందని పేర్కొన్నారు. ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.పద్మనాభం మాట్లాడుతూ ఆడపిల్ల చదివితే కుటుంబంతో పాటు సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య కె.సుధారాణి మాట్లాడుతూ అబ్బాయిలు, అమ్మాయిల వైఖరిలో మార్పు రావాలన్నారు. తద్వారానే లింగ సమానత్వం ఏర్పడుతుందని వివరించారు. నిర్వాహకురాలు ఆచార్య డి.కృష్ణమూర్తి మాట్లాడుతూ అమ్మాయిలు అపరిచిత వ్యక్తులతో పాటు పరిచయ వ్యక్తులతో కూడా జాగ్రత్తగా మెలగాలని తెలిపారు. లేని పక్షంలో ఢిల్లీ సంఘటన వంటి విపరీత పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా వీసీ చేతుల మీదుగా ఇండియన్ జర్నల్ ఆఫ్ ఉమెన్ అండ్ డెవలప్‌మెంట్ సంచికలను విడుదల చేశారు. దిశా యాప్, మహిళలు, యువతుల భద్రత అనే అంశంపై నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీత, డాక్టర్ రమణ, డాక్టర్ రాజరాజేశ్వరి, డాక్టర్ శ్రీలత కిషోర్, డాక్టర్ జగదీశ్వరి, డాక్టర్ ఓబులేసు, వివిధ విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడపిల్లల రక్షణ మన బాధ్యత

ఎర్రావారిపాళెం: ఆడబిడ్డలను రక్షించుకోవడం అందరిపై ఉందని ఎస్ఐ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలికలు నడుచుకోవాల్సిన తీరుతెన్నుల గురించి పలు సూచనలు చేశారు. అంతకుముందు అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పరిమళ, ఏఎస్‌ఎం, ఆశావర్కర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బాలికా సంరక్షణ మన బాధ్యత

తిరుచానూరు: బాల్య వివాహాలు, భ్రూణ హత్యలు, శిశు మరణాలు, బాలికలకు వ్యతిరేకంగా జరిగే వివిధ రకాల హింసలను అరికట్టి, బాలికల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహిళా అధ్యయన కేంద్రం రీడర్ డాక్టర్ ఉమాదేవి అన్నారు. మంగళవారం మహిళా విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో డాక్టర్ పి.మాధవి నేతృత్వంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.రజిని మాట్లాడుతూ ప్రతి అమ్మాయి తనలోని సామర్థ్యాన్ని గుర్తుంచుకుని ఆశయ సాధనకు కృషి చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సమతుల్యమైన ఆహారం తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. బాలికలు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్రం, విభాగం టీచింగ్, నాన్ టీచింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడపిల్లలకు రక్షణ కల్పిద్దాం

రామచంద్రాపురం: ఆడపిల్లలకు రక్షణ కల్పించి వారి బంగారు భవిష్యత్‌కు పునాదులు వేద్దామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మనీలా పిలుపునిచ్చారు. మంగళవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాల విద్యార్థులతో హెచ్‌ఎం వాగ్దేవి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు పౌష్టికాహారం ప్రాముఖ్యత, బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే దుష్పరిణామాలు, వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. ఎవరైనా బాల్య వివాహాలు చేయడానికి ప్రయత్నిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు





కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు, మాట్లాడుతున్న మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ రజని

పాముల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- డాక్టర్ జైదీప్ సి మీనన్ వెల్లడి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ జైదీప్ సి.మీనన్

తిరుచానూరు: పాములు విష స్వభావం కలిగి ఉంటాయని వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేరళ వర్సిటీ అమృత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్ వైద్యుడు డాక్టర్ జైదీప్ సి.మీనన్ తెలిపారు. ఎస్వీయూ జంతు శాస్త్ర విభాగం విశ్రాంత అధ్యాపకుడు ఆచార్య మచ్చా భాస్కర్ పర్యవేక్షణలో ఐసీఎంఆర్ ప్రాజెక్ట్‌లో భాగంగా మంగళవారం నేషనల్ స్టడీ ఆఫ్ స్నేక్ బైట్స్ అనే అంశంపై సెమినార్ హాల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాముల్లో వివిధ రకాలను కూలంకుషంగా వివరించారు. వివిధ రకాల పాముల కాట్లను గుర్తించే విధానాన్ని తెలియజేశారు. పాముల లక్షణాలు, అవి నివాస ప్రాంతాలు, విష స్వభావం గురించి తెలిపారు. పాముకాటుకు గురి కాకుండా ప్రజలు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. పాము కాటుకు గురైన వ్యక్తికి తక్షణం అందించాల్సిన ప్రథమ చికిత్సల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎస్.కిషోర్, ఐసీఎంఆర్ ప్రాజెక్టు ప్రిన్సిపాల్, ఇన్వెస్టిగేటర్ ఆచార్య ఎం.భాస్కర్, అధ్యాపకులు డాక్టర్ ఎం.రాజశేఖర్, టీటీడీ ఉద్యోగి భాస్కర్ నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీలకు ఏర్పాట్లు



మైదానాన్ని పరిశీలిస్తున్న జేఈఓ సదాభార్గవి

తిరుపతి అలిపిరి: టీటీడీ ఉద్యోగుల వార్షిక క్రీడా పోటీల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేయాలని జేఈఓ సదాభార్గవి అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని ఎస్వీ హైస్కూల్ మైదానాన్ని మంగళవారం ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ టీటీడీ ఉద్యోగుల వార్షిక క్రీడా పోటీలు ఫిబ్రవరి 2న ప్రారంభమై 18వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఉద్యోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా షెల్టర్లు, కుర్చీలు, తాగునీరు, అల్పాహారం, భోజనం, మరుగుదొడ్లు, పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వార్షిక క్రీడాపోటీలు నిర్వహించే ఎస్వీ హైస్కూల్ మైదానాన్ని పరిశీలించిన ఆమె, అధికారులకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట డిప్యూటీ ఈఓ స్నేహలత, ఎస్ఈ (ఎలక్ట్రికల్) వెంకటేశ్వర్లు, డీఈఓ భాస్కర్ రెడ్డి, ఎస్వీ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్, ఇతర అధికారులు ఉన్నారు.

బాల పురస్కార్‌పై హర్షం



భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మిద్దె గౌరవిరెడ్డి

రేణిగుంట: గాజులమండ్యంకు చెందిన మిద్దె వెంకటరామిరెడ్డి మనుమరాలు, మిద్దె తరుణ, చంద్రశేఖర్ రెడ్డి కుమార్తె గౌరవిరెడ్డి అత్యంత పిన్న వయస్సులో నాట్యకళాకారిణిగా ప్రతిష్టాత్మక జాతీయ బాల పురస్కార్–2023 అందుకోవడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. సోమవారం వివిధ రంగాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచిన 11మంది బాలబాలికలను ప్రధానమంత్రి బాలపురస్కార్–2023కు ఎంపిక చేశారు. వీరికి సోమవారం ఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో జరిగిన కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపతిముర్ము చేతుల మీదుగా అందించారు. ఈ మేరకు గాజులమండ్యంలో మంగళవారం పలువురు హర్షం వ్యక్తం చేశారు.

గాజులమండ్యంలో నాట్యప్రదర్శన

గౌరవిరెడ్డి 12 ఏళ్ల కిందట ఐదేళ్లప్రాయంలో రేణిగుంట మండలం గాజులమండ్యంలో వెలసిన శ్రీ కామాక్షి సమేత మూలస్థానేశ్వరాలయ ప్రాంగణంలో కళ్లకు గంతలు కట్టుకుని పాదాలకు పారాణి అద్దుకుని కూచిపూడి నాట్యం చేస్తూ సింహనంది రూపాన్ని చిత్రీకరించి అబ్బురపరిచింది. ఆమె అంచెలంచెలుగా దేశ, విదేశాల్లో ప్రదర్శనలిస్తూ ఎన్నో అవార్డులు, రివార్డులను సొంతం చేసుకుంది. గాజులమండ్యంలో ఆమె తాత మిద్దె వెంకట్రామిరెడ్డికి చెందిన ఇల్లు ఇప్పటికీ ఉంది. వారు తల్లిదండ్రులు చాలా ఏళ్ల కిందట హైదరాబాద్‌లో స్థిరపడ్డారు.

ఎమ్మెల్యే వివాహ కానుక పంపిణీ

చంద్రగిరి: మండల పరిధిలోని రెడ్డివారిపల్లి పంచాయతీ షికారీ కాలనీలో మంగళవారం ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి చేతుల మీదుగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అందజేసిన వివాహ కానుకను అందజేశారు. షికారీ కాలనీకి చెందిన పవన్ కల్యాణ్, దీపలకు వివాహం నిశ్చయమైంది. ఈ సందర్భంగా సర్పంచ్ రేవతి ఆధ్వర్యంలో నూతన వధూవరులకు ఎమ్మెల్యే అందజేసిన బంగారు తాళిబొట్టు, వెండిమెట్టెలు, ముహూర్తపు వస్త్రాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదం, అమ్మవారి పసుపు–కుంకుమతో కూడిన కానుకను అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే చెవిరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు ఔరంగ జేబు, ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య



మృతి చెందిన మహిళ (ఫైల్‌ఫోటో)

రామచంద్రాపురం: అనుప్పల్లి పంచాయతీ బీరమాకుల కండ్రిగ గ్రామానికి చెందిన కన్నెమ్మ (65) అనే వృద్ధురాలు సోమవారం చేసుకంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కన్నెమ్మ ఇంటి చుట్టూ మట్టి తోలడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె కుమారుడు సుబ్రమణ్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై గిరిబాబు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కుటుంబసభ్యులు ఆమె ఇంటి చుట్టూ పోసిన మట్టిని తొలగించేంత వరకు దహన క్రియలు చేయమని, పోస్టుమార్టానికి శవాన్ని తీసుకువెళ్లడానికి వీలులేదంటూ భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో తహశీల్దార్ చిన్న వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకుని వారి ఇంటి చుట్టూ మట్టి పోస్తే ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు. రేపు ఉదయం వారి ఇంటి చుట్టూ ఉన్న స్థలాన్ని సర్వేచేసి పట్టా భూమి కాకుంటే మట్టిని తొలగిస్తామని హామీ ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడానికి అంగీకరించారు. ఇదిలా ఉండగా స్థానికులు కొందరు ఆమె కుటుంబ కలహాలతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు ఆరోపిస్తున్నారు. అసలు విషయం పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

పరిసరాల శుభ్రతపై అవగాహన

ఏర్పేడు : స్థానిక అశోక్‌నగర్‌లో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాళెం శివయ్య ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌ఓ శివరాజు, ఎంపీహెచ్‌ఓ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

– డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: సీఎం జగనన్న ప్రజాసంక్షేమమే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ పేదల గుండెల్లో స్థిరంగా నిలిచిపోయారన్నారని, అందువల్ల వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ఎంతమందితో పొత్తులు పెట్టుకున్నా గెలుపు వైఎస్సార్‌సీపీదేనని తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తిరుపతి 4వ డివిజన్‌లోని పోస్టల్‌కాలనీలో మంగళవారం డివిజన్ అధ్యక్షుడు చింతలచేను గోపి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి గడపకూ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. జగనన్న మూడున్నరేళ్ల ప్రగతి, అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోనే జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఏ గడపలో చూసినా రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు లబ్ధి పొందిన వారే ఉన్నారన్నారు. పేదలకు అందించిన సంక్షేమ పథకాలే జగనన్నను గెలిపిస్తాయన్నారు.

తిరుపతి అభివృద్ధే ధ్యేయంగా..

గత ప్రభుత్వాల్లో ఎన్నడూ జరగనంతగా మూడన్నరేళ్లలో తిరుపతి ఎంతో అభివృద్ధి చెందిందని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. తిరుపతి అభివృద్ధి, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. మాస్టర్‌ప్లాన్ రోడ్లతో తిరుపతిలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మునిరావిరెడ్డి, మోహన్‌యాదవ్, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్లు కడపగుంట అమరనాథ రెడ్డి, వెంకటేష్‌రాయల్, సురేష్‌రెడ్డి, పార్టీ నాయకులు బాల్జీ, సలామ్, కలీమ్, రమేష్‌రెడ్డి, దొడ్డారెడ్డి మురళీరెడ్డి, మార్కెట్ వంశీ, ఇమ్రాన్, ప్రసాద్, కంకనాల రమేష్, రాజేంద్ర, ధనశేఖర్, శాంతారెడ్డి, రాజేశ్వరి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు







శ్రీవారి ఆలయం వెలుపల ఏపీ ప్రభుత్వ విప్ ప్రసాద్ రాజు, ఏపీ ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు,లేబర్ కమిటీ కమిషనర్ శ్రీనివాసులు నాయుడు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 10 కంపార్టుమెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 70,413 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 32,206 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.37 కోట్లు భక్తులు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం అవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

శ్రీవారి సేవలో ప్రముఖులు..

తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ఏపీ ప్రభుత్వ విప్ ప్రసాద్ రాజు, ఏపీ ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, లేబర్ కమిటీ కమిషనర్ శ్రీనివాసులునాయుడు, కేంద్ర మాజీమంత్రి పల్లంరాజు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ఆలయంలోని గోపురం, ధ్వజస్తంభాన్ని శుద్ధి చేస్తున్న ఆలయ అర్చకులు, అధికారులు



అమ్మవారికి పరదాలను వితరణ చేస్తున్న భక్తుడు శ్రీనివాసులు

తిరుచానూరు: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో జనవరి 28న రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం ఉదయం 6.30 నుంచి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణంతో పాటు పలు సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. ఈ కారణంగా ఆలయంలో కల్యాణోత్సవం, ఊంజల్‌సేవను రద్దు చేశారు.

8 పరదాలు విరాళం..

హైదరాబాదుకు చెందిన శ్రీనివాసులు అనే భక్తుడు ఈ సందర్భంగా ఆలయానికి 8 పరదాలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ లోకనాథం, ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ మధు, ఆలయ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ దాము, అర్చకులు బాబుస్వామి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు



శ్రీనివాసరావుకు తీర్థప్రసాదాలు అందిస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం ఏపీ ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సతీష్‌మాలిక్, శ్రీనాథ్, నారాయణస్వామి, హరియాదవ్ పాల్గొన్నారు.

పొదుపుతో ఆర్థిక పురోగతి



ఆడిట్ నివేదిక అందిస్తున్న బాలాజీరెడ్డి

రేణిగుంట : మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా పొదుపు చేస్తే ఆర్థిక పురోగతి సాధించవచ్చని రాస్ ఆడిట్ విభాగాధిపతి బాలాజీరెడ్డి తెలిపారు. మండలంలోని కరకంబాడి ఇందిరానగర్ రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందిరానగర్ క్లస్టర్‌లోని 56 సంఘాలు, 688 మంది సభ్యులకు సంబంధించి పొదుపు సొమ్ము, రుణాలు, ఇతర లావాదేవీలపై ఆడిట్ చేసి రిపోర్టు అందించారు. కార్యక్రమంలో పీడీ వెంకటేష్, వెంకటకుమార్, బాలాజీ, ఇందుమతి, నాగమణి, జ్యోతి, గౌతమి, స్వాతి, శంకరయ్య పాల్గొన్నారు.

రథ సప్తమి పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్ల ఆవిష్కరణలో అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు

నగరి : పట్టణంలో టీటీడీ అనుబంధంలో ఉన్న శ్రీకరియ మాణిక్య స్వామి వారి ఆలయంలో ఈనెల 28వ తేదీన జరుగనున్న రథసప్తమి, ప్రత్యేక ఆర్జిత కల్యాణోత్సవం పోస్టర్లను మంగళవారం ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ ఆవిష్కరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు, భక్తులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కోవిడ్‌తో ఆగిన ఈ ఉత్సవాలు రెండేళ్ల తరువాత ఈ ఏడాది జరగనుండడంతో గతంలో కంటే భారీగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. విద్యుత్ దీపాలంకరణ, పుష్పాలంకరణ ప్రత్యేకంగా ఉంటుందని, అధిక సంఖ్యలో ప్రసాద వినియోగం చేస్తామన్నారు. ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్న టీటీడీ ఈవో, స్థానిక ఆలయాల జేఈవోకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానార్చకులు మారుతి ప్రసాద్, వేద పండితుడు రాంప్రసాద్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

సచివాలయంలో ఆధార్ సేవలు



ఆధార్‌లో వివరాలను అప్‌డేట్ చేస్తున్న సచివాలయ సిబ్బంది

పాకాల: మండలంలోని మద్దినాయనపల్లి సచివాలయంలో ఆధార్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి పవిత్ర మాట్లాడుతూ సోమవారం, మంగళవారం రెండురోజుల పాటు ఈ క్యాంప్ నిర్వహించినట్లు చెప్పారు. సుమారు 66 మందికి ఆధార్‌కార్డుల్లో మార్పులు, చేర్పులు, తప్పు, ఒప్పులను సరి చేసి సేవలు అందించామని వివరించారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్న చేదోడు' సర్టిఫికెట్లను ఇవ్వండి

తిరుపతి అర్బన్: జగనన్న చేదోడు పథకానికి సంబంధించిన లబ్ధిదారులు ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం, లేబర్ సర్టిఫికెట్‌లను తమ పరిధిలోని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌కు ఇవ్వాలని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుబ్రమణ్యం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాటిని లబ్ధిదారులు బుధ, గురువారాల్లో ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.10 వేలు చొప్పున ఐదేళ్లలో రూ.50 వేలు అందించనున్న విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పటికే 1, 2 విడతల కింద ప్రభుత్వం రూ.11.55 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. 3వ విడత నిధుల మంజూరుకు షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో 2వ విడతలో లబ్ధి పొందినవారు, కొత్తగా ఎంపికై న వారు సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. 2020–21లో 5,640 మందికి రూ.5.64 కోట్లు, 2021–22లో 5904 మందికి రూ.5.91 కోట్లు ప్రభుత్వం అందించినట్లు స్పష్టం చేశారు. అర్హులైన వారు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ, సంఘం నాయకులు

పాకాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రమేష్‌బాబు చేతుల మీదుగా అంబేడ్కర్ ఆశయసాధన ప్రచారసమితి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆ సంస్థ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు గంగులయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలతో పాటు వెనుకబడిన కులాల వారి కోసం తాము అనేక ఉద్యమాలు చేశామని, భవిష్యత్‌లో కూడా ఇలాంటి ఉద్యమాలను కొనసాగిస్తూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చూపిన బాటలో నడుస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామయ్య, వెంకటస్వామి, వెంకటముని, లత, దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత అక్షరాభ్యాసం రేపు

తిరుపతి కల్చరల్: వసంత పంచమి సందర్భంగా శుక్రవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు రాముల వారి దక్షిణ మాఢవీధిలోని చిగోర ఆధ్యాత్మిక కేంద్రంలో ఉచితంగా అక్షరాభ్యాసం నిర్వహిస్తున్నట్లు ఆ కేంద్రం నిర్వాహకుడు చిత్రపు హనుమంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ముందు గణపతి, సరస్వతి హోమం నిర్వహించి అనంతరం పిల్లలతో అక్షరాభ్యాసం చేయించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో పాల్గొన్న వారికి బాసర శ్రీసరస్వతి అమ్మవారి క్షేత్రం నుంచి ప్రత్యేకంగా తెప్పించిన అక్షితలు, కుంకుమ ప్రసాదం అందజేయనున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొన దలచిన వారు 25వ తేదీ గురువారం సాయంత్రంలోపు 9440066267, 9440271154లను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

ప్లాస్టిక్ అనర్థాలకు చెక్

ప్రమాదకరంగా పరిణమించిన పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ భూతాన్ని అరికట్టి, కాలుష్య రహిత సమాజ స్థాపనకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నడుం బిగించింది. ఆ దిశగా ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు కూడా జారీ చేసింది. ఈ నిబంధనలను అమలు చేయని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఇటీవల రూ.3,800 కోట్లు జరిమానా విధించింది. గుజరాత్ వంటి రాష్ట్రాలకు ఎన్‌జీటీ భారీ జరిమానా విధించి ఇతర రాష్ట్రాలకు హెచ్చరికలు జారీ చేసింది. ఈ క్రమంలో అప్రమత్తమైన రాష్ట్రప్రభుత్వం మున్సిపాలిటీలు, పంచాయతీలకు నిషేధిత ప్లాస్టిక్ అమలుకు మార్గదర్శకాలను విడుదల చేసింది.

- 26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీలు పూర్తిగా నిషేధం
- నిబంధనల అమలుకు చర్యలు
- క్షేత్రస్థాయిలో తనిఖీలకు రంగం సిద్ధం
- ఇప్పటికే నాలుగునెలలు గడువు ఇచ్చిన ప్రభుత్వం
- హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ



తిరుపతి తుడా: పర్యావరణానికి ప్రమాదకరంగా పరిణమించిన నిషేధిత ప్లాస్టిక్ వ్యర్థాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు రాష్ట్రప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్లాస్టిక్ బ్యానర్లు, ఫ్లెక్సీలపై నిషేధాన్ని విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. గతేడాది అక్టోబర్ 2 నుంచే ఈ నిబంధనలు అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే వెనువెంటనే నిబంధనలను అమలు చేస్తే తమ వ్యాపారాలు దెబ్బతింటాయని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోలేమని ప్రభుత్వానికి వ్యాపారులు విజ్ఞప్తి చేయడంతో నాలుగు నెలలు సడలింపు ఇచ్చింది. జనవరి 26న రిపబ్లిక్ డే నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లను పూర్తిస్థాయిలో నిషేధించనున్నారు.

తిరుపతిలో కఠినంగా అమలు..

ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్ల నిషేధాన్ని కఠినంగా అమలు చేసేందుకు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు రంగంలోకి దిగారు. రెండురోజులుగా సంబంధిత నిషేధిత నిబంధనలను వ్యాపారులకు అందజేస్తున్నారు. ఈనెల 26 నుంచి పూర్తిస్థాయిలో నిషేధించాలని ఆదేశాలు అందడంతో అధికారులు రంగంలోకి దిగారు. చెత్తను వందశాతం రీయూజ్, రెడ్యూస్, రీసైకిల్ చేయాలని, మురుగునీటి వ్యర్థాలను శుద్ధి చేసిన తర్వాతే దిగువ ప్రాంతాలకు వదలాలని, చెత్తను కాల్చే పద్ధతిని విడనాడాలని వంటి నిబంధనలను ఎన్‌జీటీ కఠినతరం చేసింది. స్వచ్ఛభారత్ మిషన్ ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, గ్లాసులు వంటి వాటిపై నిషేధం విధిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని తిరుపతి నగరంలో అధికారులు కఠినంగా అమలు చేసి ఇతర నగరాలకు ఆదర్శంగా నిలిచారు. అదేస్థాయిలో ఇప్పుడు నిషేధిత ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లను అరికట్టి తిరుపతిని ఆదర్శంగా నిలిపేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపడుతున్నారు. ఒకటిరెండు రోజుల్లో వ్యాపారులతో మరోసారి సమావేశమై ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించాలని అధికారులు కోరనున్నారు.

పెయింటర్లకు పూర్వవైభవం..

ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లపై నిషేధం అమల్లోకి రావడంతో వ్యాపారులు క్లాత్, ప్లైవుడ్, అట్టలపై ముద్రించేందుకు సమాయత్తం అవుతున్నారు. స్వాగత తోరణాలను కూడా ప్లైవుడ్‌తో కట్టించేలా ప్లాన్ చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో చాలా రోజులుగా పని లేకుండా ఇబ్బంది పడిన పెయింటర్లకు పూర్వ వైభవం రానుంది. ప్లాస్టిక్ ఫ్లెక్సీలు అందుబాటులోకి వచ్చాక పెయింటర్లకు పనిలేకుండా పోయింది. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వారికి మళ్లీ రెట్టింపు ఆదరణ లభించనుంది.

స్వచ్ఛందంగా నిలిపివేయాలి..



నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, రాష్ట్రప్రభుత్వ ఆదేశాలకు కట్టుబడి వ్యాపారులు ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్ల తయారీని స్వచ్ఛందంగా నిలిపివేయాలి. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి. ప్లాస్టిక్ వల్ల సమాజానికి, ప్రకృతికి తీవ్ర ప్రమాదం పొంచి ఉంది. కాలుష్య రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా తీసుకున్న నిర్ణయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి. ఈనెల 26 తర్వాత వీటిని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించేది లేదు. ఇకపై నగరంలో ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లు పూర్తిస్థాయిలో నిషేధం ఉంటుంది.

– డాక్టర్ హరికృష్ణ, హెల్త్ ఆఫీసర్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్

అమ్మవారి సేవలో మాజీ గవర్నర్ నరసింహన్



అమ్మవారి ఆలయం వెలుపల మాజీ గవర్నర్ నరసింహన్ దంపతులు



అమ్మవారి ఆలయం వెలుపల హీరోయిన్ లావణ్య త్రిపా ఠి

తిరుచానూరు: శ్రీ పద్మావతి అమ్మవారిని మాజీ గవర్నర్ నరసింహన్ కుటుంబ సమేతంగా మంగళవారం అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద ఆశీర్వాద మండపంలో అర్చకులు వేద ఆశీర్వచనం అందించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, సూపరింటెండెంట్ మధు, ఆలయ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న హీరోయిన్ లావణ్య త్రిపాఠి

శ్రీ పద్మావతి అమ్మవారిని హీరోయిన్ లావణ్య త్రిపాఠి మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్న ఆమెకు వేద ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం అందించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

27న ఎలక్ట్రీషియన్ డే వేడుకలు



మాట్లాడుతున్న అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బీసీ హరీష్

తిరుపతి కల్చరల్: తిరుపతి ప్రైవేట్ ఎలక్ట్రికల్, ప్లంబర్స్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో ఉదయం 9 గంటలకు ఎలక్ట్రీషియన్ డే వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బీసీ హరీష్ తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలక్ట్రికల్ బల్బు సృష్టికర్త థామస్ అల్వా ఎడిషన్ జన్మదినాన్ని తాము గత రెండేళ్లుగా ఎలక్ట్రీషన్ డేగా జరుపుకుంటున్నామని తెలిపారు. కర్నాలవీధిలోని అసోసియేషన్ కార్యాలయం నుంచి గంధమనేని శివయ్య భవన్ వరకు ముందుగా కార్మికులతో ర్యాలీ చేపట్టి, అక్కడ వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ఎలక్ట్రీషియన్స్, ప్లంబర్స్, మోటారు మెకానిక్స్, రీవైండర్స్ అంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. అసోసియేషన్ నాయకులు మురగయ్య, శేషాద్రి, రమేష్‌బాబు, వెంకటరాయులు, భానుప్రకాష్‌రెడ్డి, శివకుమార్, బాషా, రవి, మురళి పాల్గొన్నారు.

నేటి నుంచి కుంభాభిషేకం పూజలు



నాగలింగేశ్వరీ దేవి ఆలయం

పాకాల : మండలంలోని ఇరంగారిపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న పాలినేనివారి పల్లి గ్రామంలో వెలసిన నాగలింగేశ్వరీ దేవి ఆలయ 12వ వార్షికోత్సవ మహా కుంభాభిషేక వేడుకలను బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు భాస్కర్‌రెడ్డి, ఇందుమతి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25, 26, 27 తేదీల్లో పూజలు చేపట్టనున్నట్లు చెప్పారు. స్థానికులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ పూజల్లో పాల్గొనాలని కోరారు.

శిశుసంక్షేమ శాఖ ఉద్యోగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళా శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులు

తిరుపతి అర్బన్: కలెక్టరేట్ కార్యాలయంలోని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి కార్యాలయం వద్ద ఆ విభాగానికి చెందిన ఉద్యోగులు మంగళవారం భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు రాజారత్నం మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని మహిళా శిశు సంక్షేమ జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులపై కొందరు దాడి చేయడం సరికాదన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై దాడులు చేయడాన్ని తప్పుపట్టారు.

వందశాతం ఆస్తి పన్ను వసూలు

– కమిషనర్ హరికృష్ణ వెల్లడి



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ హరికృష్ణ

తిరుపతి తుడా: వందశాతం ఆస్తిపన్ను వసూలే లక్ష్యంగా రెవెన్యూ అధికారులు పని చేయాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరికృష్ణ ఆదేశించారు. కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో మంగళవారం డెప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పన్ను వసూలుపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్చి 31వ తేదీ నాటికి అన్ని రకాల ఆస్తి పన్నులను వందశాతం వసూలు చేయాల్సిందేనని సూచించారు. మొండి బకాయిదారులపై ప్రత్యేక దృష్టి సారించి, వారి నుంచి కూడా పన్నులను వసూలు చేయాలన్నారు. డివిజన్ల వారీగా సమీక్ష నిర్వహించి పన్నులను రాబట్టాలన్నారు. మొండి బకాయిదారుల వద్దకు వెళ్లేటప్పుడు ఒక బృందంగా వెళ్లాలని సూచించారు. ఆస్తి పన్నుతో పాటు వాటర్, యూడీఎస్ చార్జీలను ఒకేసారి వసూలు చేయాలన్నారు. అలానే అడ్వర్టైజ్‌మెంట్ బకాయిలను సైతం వసూలు చేయించడంపై దృష్టి సారించాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన బాడుగలను రాబట్టాలన్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వారీగా పన్ను వసూళ్లపై ఆర్‌ఓలు సమీక్షించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్లు కెఎల్.వర్మ, సేతుమాధవ్ పాల్గొన్నారు.

గీతకు డాక్టరేట్ ప్రదానం



తిరుచానూరు : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం సాంఖ్యక శాస్త్ర విభాగంలో పరిశోధన చేసిన విద్యార్థిని కే.గీతకు డాక్టరేట్ లభించింది. ఆ విభాగ ప్రొఫెసర్ బి.సరోజమ్మ పర్యవేక్షణలో 'ఫోర్ క్యాస్టింగ్ మెథడ్స్ విత్ న్యూరల్ నెట్‌వర్క్స్' అనే అంశంపై పరిశోధనలు చేసినందుకు డాక్టరేట్ పట్టా అందిస్తున్నట్లు వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ఎం.దామ్లా నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

శ్రీశ్రీ కళావేదిక గౌరవాధ్యక్షుడిగా చేజెర్ల



మాట్లాడుతున్న హరిసర్వోత్తమ నాయుడు

తిరుపతి కల్చరల్: ఐఎస్‌ఓ గుర్తింపు పొందిన సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ గౌరవాధ్యక్షుడిగా తిరుపతికి చెందిన చేజెర్ల ఇంద్రకుమార రాజును నియమించినట్లు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు జి.హరిసర్వోత్తమ నాయుడు తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా పలు వ్యాపారాలు నిర్వహిస్తున్న చేజెర్ల ఇంద్రకుమార్ రాజు తన తల్లి పేరున చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి విశేష సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఆయన సేవలను గుర్తించి అంతర్జాతీయ గౌరవాధ్యక్షుడిగా నియమిస్తూ సంస్థ చైర్మన్ డాక్టర్ కె.ప్రతాప్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. యువతను సాహిత్య రంగంలో ప్రోత్సహించాలనే లక్ష్యంతో శ్రీశ్రీ కళావేదిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తద్వారా 13 ఏళ్లుగా 116 జాతీయ శతాధిక కవి సమ్మేళనాలు విజయవంతంగా నిర్వహించడంతో పాటు అనేక ప్రపంచ రికార్డు కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఆయనతో పాటు జయపాల్ పాల్గొన్నారు.

వైభవంగా నడివీధి గంగమ్మ జాతర



ఊటగుంటలో నడివీధి గంగమ్మకు సారె అందిస్తున్న మేయర్ డాక్టర్ శిరీష, తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ఈఓ, పాలక మండలి సభ్యులు



నడివీధి గంగమ్మకు పూజలు చేసి హారతి సమర్పిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి

- అమ్మవారికి గంగమ్మసారె

తిరుపతి కల్చరల్: నగర పరిధిలోని 29వ డివిజన్, నరసింహతీర్థం రోడ్డు, కుమ్మరితోపు, ఊటగుంటలో మంగళవారం నడివీధి గంగమ్మ జాతర అత్యంత వైభవంగా నిర్వహించారు. ఏటా సంప్రదాయబద్ధంగా సాగే శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయం నుంచి నడివీధి గంగమ్మకు సారెను వేడుకగా సమర్పించారు. శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయం నుంచి మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినయరెడ్డి, ఆలయ ఈఓ మునికృష్ణయ్య, పాలక మండలి సభ్యులు డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారికి వస్త్రాలు, కుంకుమలతో కూడిన సారెను ఊరేగింపుగా తీసుకొచ్చి స్థానిక కార్పొరేటర్ ఆదిలక్ష్మి, వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు నడివీధి గంగమ్మను దర్శించుకున్నారు. అనంతరం మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ కార్పొరేటర్ ఆదిలక్ష్మి, స్థానికులు భక్తిశ్రద్ధలతో నడివీధి గంగమ్మ జాతర చేపట్టడం అభినందనీయమన్నారు. డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి మాట్లాడుతూ ఊటగుంట నడివీధి గంగమ్మ జాతరలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. డివిజన్ కార్పొరేటర్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా ఊటగుంట నడివీధి గంగమ్మ జాతర నిర్వహిస్తున్నామని, నగర ప్రజలంతా అమ్మవారిని దర్శించుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే బాబు, కార్పొరేటర్లు నరసింహ ఆచారి, పొన్నాల చంద్ర, రేవతి, శైలజ, సునీత, కల్పన, ప్రవల్లికా రెడ్డి, సంధ్య, డివిజన్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.